# మానవ వికాస వేదిక

## 2వ రాష్ట్ర మహాసభలు

**సమయం : 2008 జనవరి 12,13 తేదీలు (రెండవ శనివారం, ఆదివారం)**

**వేదిక : సింగరేణి కమ్యూనిటీ హాల్ (ఆర్.జి.-1), గోదావరిఖని, కరీంనగర్ జిల్లా**

**మిత్రులారా!**

'ఈ ప్రపంచానికి మానవుడే మహనీయుడు' అని చెప్పే వాదాన్ని మానవవాదం(హ్యూమనిజం) అంటాం. మానవుణ్ణి శాసించే అతీతశక్తి ఏదీ లేదని, ఇప్పటివరకు జరుగుతూ వస్తున్న సమాజ అభివృద్ధి అంతా మానవుని విజ్ఞాన ఫలితమేనని మానవవాదం చెబుతుంది. ఏ శాస్త్రీయ పరిశోధనలైనా, ప్రభుత్వాల ప్రణాళికలైనా, పరిపాలనలయినా సమాజ అభివృద్ధి కోసమే తప్ప కొద్దిమంది స్వార్థప్రయోజనాల కోసం జరగరాదని ఆశిస్తుంది. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో ప్రజాస్వామిక విలువల పెరుగుదల దాని ప్రధాన ఆశయం. మానవ సమైక్యతను అడ్డుకునే కులతత్వాన్ని, భావదాస్యాన్ని పెంచే మతతత్వాన్ని, అభివృద్ధిని అడ్డగించే మూఢత్వాన్ని సమూలంగా తొలగించాలని మానవవాదం కోరుతుంది.

నానాటికీ ప్రపంచమంతటా విస్తరిస్తున్న మానవవాదాన్ని పునాదిగా చేసుకుని 2004 సెప్టెంబర్ 12న మానవవికాస వేదిక (మా.వి.వే.) హైదరాబాద్‌లో ఉదయించింది. 2005 జనవరిలో జరిగిన మొదటి రాష్ట్రమహాసభల నిర్ణయాలననుసరించి ఈ మూడేళ్ళ కార్యక్రమాలను సాగించింది. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు సైన్సు ఉత్సవాలను జరిపింది. పాఠశాల విద్యార్థుల్లోని భౌతికశాస్త్ర అభిరుచిని పెంచడానికి, వారిలో దాగివున్న ప్రతిభను వెలికితీసి సత్కరించి ప్రోత్సహించడానికి 2005లో ప్రతిభా పరీక్షలు నిర్వహించింది. అదేమాదిరి 2006లో గణితశాస్త్రంలో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ఆ 'బాలమేధావుల'కు పౌరసన్మానం జరిపింది. 'నేటి బాలలే రేపటి సమాజ సంపద' అని చాటి చెప్పింది.

సమాజ నిర్మాణానికి మూలం కుటుంబం. కుటుంబసభ్యుల మధ్య సదవగాహన, ప్రజాస్వామికతలను పెంచడానికి, కులమతాల అడ్డుగోడలు లేకుండా కుటుంబాల మధ్య సమైక్యతను సాధించడానికి 2006, 2007 సంవత్సరాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించిన 'మానవవాదుల కుటుంబమేళా' పలువురి ప్రశంసలందుకుంది. నేటి యువతరాన్ని కుల,మత,కట్నాల్లేని పెళ్ళిళ్ళ వైపు నడిపించి నవసమాజ నిర్మాణ భాగస్వాములు చేయడానికి 'నవతరం పెళ్ళివేదిక'ను మా.వి.వే. నడుపుతోంది. కులనిర్మూలనకు సదస్సులను కూడా నిర్వహించింది.

మూఢనమ్మకాల తొలగింపుకు మా.వి.వే. అనుబంధ సంస్థ 'మానవ వికాస కళామండలి' తన కృషిని కొనసాగిస్తున్నది. వాస్తు, జ్యోతిష్యం వంటి దగాకోరు నమ్మకాల బండారాన్ని, వాటి పేరుతో జరిగే దోపిడీ వ్యాపారాన్ని ఎండగడుతూ ప్రసార మాధ్యమా